క్లుప్తంగా

గడప గడపకు మన ప్రభుత్వం


సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

సోమశిల: అనంతసాగరం మండలం పడమటి కంభంపాడులో ఆదివారం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ లబ్ధి కరపత్రాలను వారికి అందజేశారు. జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రగిపోస రాధమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కలిగిరి: మండల సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ మెట్టుకూరు శిరీషా అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ జి. వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఆత్మకూరు: పట్టణంలోని చర్చిల్లో ఆదివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రార్థనా గీతాలు, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తెలుగు బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని క్రిస్టియన్ పేటలో ఆదివారం రాత్రి పలువురు క్యాండిల్స్‌తో ఏసుక్రీస్తు భక్తి గీతాలను ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. విజయబాబు, విల్సన్, నందవరం ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపవాస దీక్షలు

మర్రిపాడు: మండలంలోని ఖాన్‌సాహెబ్‌పేట అలీఔలియా దర్గా పీఠాధిపతి బందా నవాజ్ బాబా (గోపిదేశి హజరత్తయ్య) సోమవారం నుంచి ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్నట్లు అలిఔలియా మైదాన్ ట్రస్టు సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 రోజుల పాటు ఉపవాస దీక్ష కార్యక్రమాలను నిర్వహించి 41వ రోజు విరమిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు 21 కిలోల మౌలాలి సర్కారు పీరును ఊరి పొలిమేరలో ఉన్న గంగమ్మ తల్లిగుడి దగ్గర నుంచి సుమారు 1.5 కి.మీ. మేర మోకాళ్ల మీద నడిచి దర్గా ప్రాంగణంలో ఉన్న మౌలాలి సర్కార్ దర్గా ఎదురుగా గుండం ద్వారా దర్గాకు తీసుకువస్తారని 9.40 గంటలకు బంగారు పీరును ప్రతిష్ఠాపన చేస్తారని తెలిపారు.

మాగుంటకు ఘన నివాళి



కావలి: దివంగత మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి 76వ జయంతి పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మాగుంట విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుబ్బరామిరెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్‌ను వివరిస్తున్న ఏఓ

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ గోపీ మాట్లాడుతూ వికసిత్ సంకల్ప యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఏఓ శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా డ్రోన్లను కూడా సబ్సిడీ కింద అందజేస్తామన్నారు. నానో యూరియా, డీఏపీ, జీవన శిలీంద్ర నాశిక గురించి తెలిపారు. పీయం కిసాన్, డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్ చేయడం డెమో ద్వారా రైతులకు వివరించారు.

కొత్తపల్లిలో..

సోమశిల: అనంతసాగరం మండలం కొత్తపల్లిలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ, గ్రామీణ నీటి , పారిశుధ్యం, ఐసీడీఎస్, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, వ్యవసాయశాఖ, పశు సంవర్ధకశాఖలతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


అనుమసముద్రంపేట: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


సంగం: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


సోమశిల: కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు, అయ్యప్పస్వాములు


ఆత్మకూరు: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ఆత్మకూరు రూరల్: మహిమలూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక దీప శోభ

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

ఆత్మకూరు: కార్తీక మాసం క్రమేణ పౌర్ణమి తిథి ఆదివారం సాయంత్రం రావడంతో పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు వెలిగించిన దీపాలతో కార్తీక దీపోత్సవ శోభ అలరించింది. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం వెలిగించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. జేఆర్‌పేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, పంటవీధి రామాలయాల్లో, కాశీనాయన ఆశ్రమంలో భక్తులు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు.

ఆలయాల్లో కార్తీక దీపోత్సవం

ఆత్మకూరురూరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి మండలంలోని పలు దేవాలయాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపోత్సవాలు నిర్వహించారు. మండలంలోని మహిమలూరు శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు రామస్వామిపల్లి, మురగళ్ల, గండ్లవీడు, వాశిలి, బోయలచిరివెళ్ల, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

మహన్యాసపూర్వక రుద్రాభిషేకం

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమనలో కొలువైన శ్రీచక్ర సహిత కామాక్షితాయి సమేత చంద్రమౌళీశ్వరస్వామి శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉభయదాతలు నాగిరెడ్డి వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి దంపతులు, మద్దూరు వజ్రమ్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, అనంతరం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి సురేష్‌స్వామి, మిగిలిన పూజారులు ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా పల్లకి సేవ

కామాక్షిదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. ఉభయదాతలు కర్నాటి మధుసూధన్‌రెడ్డి, రాధ దంపతుల ఆధ్వర్యంలో పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. మహాశివుడి ప్రతిమను ముగ్గులతో అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళా భక్తులు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం శివదీక్ష, అయ్యప్పస్వామి భక్తులకు మధుసూదన్‌రెడ్డి భిక్షను ఏర్పాటు చేశారు.

కార్తీక దీపోత్సవం

సంగం: మండలంలోని శైవక్షేత్రాలన్నీ ఆదివారం రాత్రి హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివనామస్మరణలతో మారుమ్రోగాయి. సంగమేశ్వరాలయంలో విశేష పూలతో ఏర్పాటు చేసిన శివలింగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంగమేశ్వరాలయంతో పాటు అన్ని శైవక్షేత్రాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

సోమశిల: సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వర ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెన్నానదిలో స్నానమాచరించి కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం 6 గంటలకు అర్చకుడు రామకృష్ణశర్మ కార్తీకదీపం వెలిగించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త ఉప్పల విజయ్‌కుమార్, ఉప్పల సోమసుందరమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి

చేజర్ల: మండలంలోని కోటితీర్థంలో ఆదివారం సాయంత్రం కార్తీక పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం కోటితీర్థం కోటేశ్వర స్వామి ఆలయాన్ని ఆనుకుని ఉన్న పెన్నానదిలో మహిళలు పవిత్రస్నానాలు ఆచరించి ఆలయంలో పూజలు చేశారు. సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించి చంద్రుడిని చూసి ఉపవాస దీక్షలు విరమించారు. పరశురాముడితో ప్రతిష్ఠించిన ఆలయం కావడంతో ఎంతో ప్రసిద్ధి చెందింది.

ఓంకారేశ్వరుడికి అన్నాభిషేకం

వింజమూరు (ఉదయగిరి): వింజమూరులోని ప్రసన్నరెడ్డినగర్‌లో హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకపౌర్ణమి సందర్భంగా ఓంకారేశ్వరుడికి ఘనంగా అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకులు సాయిస్వామి గణపతి పూజ, అభిషేకాలు, అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం, ఎస్వీ చింతల, పట్టణంలోని పార్వతి పరమేశ్వరి ఆలయం, లింగాలదొన, యర్రబల్లిగడ్డ, తదతర ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో ఆదివారం ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆయా దేవాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.


ఉదయగిరి : పార్వతీపరమేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


చేజర్ల: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

దేశాభివృద్ధి పురోగతికి రాజ్యాంగ స్ఫూర్తి


అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ శశిరేఖ


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

- ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం

కావలి: దేశాభివృద్ధి పురోగతికి భారత రాజ్యాంగ స్ఫూర్తి దోహదపడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లిడ్క్యాప్) డైరెక్టర్ పరుసు మాల్యాద్రి తదితరులు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ రాజ్యాంగానికి లేని విశిష్టత భారత రాజ్యాంగానికి ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఉండడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దళితులను అక్కున చేర్చుకుని అన్ని రకాలుగా అంగా ఉండి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుందుర్తి కామయ్య, ఆత్మకూరు రాజేష్, పేరం వెంకటేశ్వర్లు, నాగేశ్వరమ్మ, గంగనగారి శ్రీనివాసులు, వాయిల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

అల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వీరేంద్ర, నాయకులు డి.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఆదివారం అనంతసాగరంలోని టీజీఎస్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల పూర్వ హెచ్ఎం మహబూబ్‌సాహెబ్ గతంలో జవహర్ భారత్ ట్రస్ట్ తరఫున బహూకరించిన రూ.1.60 లక్షల డిపాజిట్‌కు అదనంగా మరో రూ.20 వేలు హెచ్ఎం బట్టెడ్డి లక్ష్మీప్రసన్నకు అందించారు. రూ.1.80 లక్షలపై వచ్చే వడ్డీతో ప్రతి ఏటా విద్యార్థులకు బహుమతులను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, లైబ్రేరియన్ నారాయణరావు, ఉపాధ్యాయులు తదితరులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఆత్మకూరు: అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో (ఏఐఎం) ఆదివారం భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ఏఐఎం సభ్యులు ర్యాలీగా వచ్చారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎం డివిజన్ కన్వీనర్ జే కొండయ్య, జిల్లా కన్వీనర్ పట్టెడ మురళీ, సభ్యులు పి పెంచలయ్య, శేషాద్రి, సుధాకర్, రజనీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నేత మద్దూరు రాజగోపాల్‌రెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి జ్యోతి కొండయ్య, పలువురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శం

ఉదయగిరి: భారతదేశానికి ప్రత్యేకమైన రాజ్యాంగాన్ని రచించి ప్రపంచ దేశాల్లో దేశానికి గొప్ప గుర్తింపు తెచ్చిన నేత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయగిరిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు ఎంతో మేలు చేయాలన్న రాజ్యాంగ స్ఫూర్తిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, కల్లూరి జనార్దన్‌రెడ్డి, నారసింహారెడ్డి, కృష్ణారెడ్డి, దారపనేని చెన్నయ్య, వెంగళరెడ్డి, రమణారెడ్డి, జబ్బార్, మట్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతరాజ్యాంగ దినోత్సవాన్ని ప్రిన్సిపల్ సుబ్బలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


ఆత్మకూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఫోరం సదస్సుకు ఆత్మకూరు న్యాయవాదులు

ఆత్మకూరు: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం రాత్రి నిర్వహించిన బహుజన లాయర్స్ ఫోరం సదస్సుకు ఆత్మకూరుకు చెందిన పలువురు న్యాయవాదులు హాజరయ్యారు. ఆత్మకూరు నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి, న్యాయవాది నందా ఓబులేసు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో ఆత్మకూరు నుంచి తరలివెళ్లారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, రిటైర్డ్ జిల్లా జడ్జి గుర్రప్ప, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్న ఈ ఫోరంలో భవిష్యత్‌లో బహుజన లాయర్ల ఫోరం అభివృద్ధిపై చర్చించారు.


గుంటూరులో జరిగిన లాయర్ల ఫోరంలో మాట్లాడుతున్న న్యాయవాది నందా ఓబులేసు

వేడుకగా అయ్యప్ప పడి పూజ


అయప్పస్వామి పడి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరులో వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్పదీక్షాధారులు పడి పూజా కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అయ్యప్ప భజనల అనంతరం భక్తులకు ప్రత్యేక ప్రసాదాలు అందజేశారు.

'ఆడుదాం ఆంధ్ర'పై రేపు శిక్షణ

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బత్తిన సింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

జలదంకి: మండలంలోని చోడవరం పంచాయతీలో సోమవారం ఉదయం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు జయప్రదం చేయాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కావలి డివిజన్ పరిధిలోని 11 పాఠశాలలకు చెందిన 158 మంది విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ ఎన్. సుజన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మాలకొండయ్య, ఉపాధ్యాయులు ప్రభాకర్, శ్రీనివాసులు, అబ్దుల్, సలాం, శివకోటారెడ్డి, భవాని, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



జలదంకి: జలదంకిలో ఆదివారం మదీనా మసీదు మేనేజింగ్ కమిటీ, విజేత ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, తహసీల్దార్ ఏవీ రమణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రసూల్‌సాహెబ్, ట్రస్టు చైర్మన్ సయ్యద్ ఖాజారంతుల్లా, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, ఎస్సై ఆదిలక్ష్మి, కావలి డివిజన్ ప్రఖ్యాత ఖాజీ ముఫ్తి ఖలీల్ అహ్మద్, యువకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన రెడ్డి సంక్షేమ సంఘం


ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

కావలి: పట్టణంలోని పెద్దచెరువు సమీపంలో యేటూరి తోటలో ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనభోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అక్కడే ఉన్న మహాకాళేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వనభోజనాల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులను సత్కారించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటా శ్రీనివాసులురెడ్డి, ఈతమొక్కల బాల మురళీరెడ్డి, పానుగోటి అనురాధ, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ మాధవరెడ్డి, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రలో పేర్లు నమోదు చేసుకోండి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహిస్తుందని, ఇందులో పాల్గొనే వారు సచివాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు 'ఆడుదాం ఆంధ్ర' పోర్టల్‌లో లేదా టోల్ ఫ్రీ నంబరు 1902 ద్వారా, ఏరియా వలంటీర్ల వద్ద 15 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో తదితర ఆటల్లో పాల్గొనదలిచిన వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆట వస్తువులను ప్రభుత్వమే అందజేస్తుందని ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రాకు నమోదు

చేజర్ల: నుంచి డిసెంబర్2వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రాకు యువతి యువకులు తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధి ంచి ఆన్‌లైన్‌లో వలంటీర్ యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల్లో పాల్గొనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 15 ఏళ్లు పైబడిన వారు అర్హులని, రెండో మించి ఎక్కువ పోటీల్లో పాల్గొన రాదన్నారు. డిసెంబర్ 11న ప్రతి సచివాలయ పరిధిలో విజేతలను మండల స్థాయికి ఎంపిక చేశామన్నారు.

భైరవకోనలో రాజారెడ్డి ప్రత్యేక పూజలు


భైరవకోనలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మేకపాటి రాజారెడ్డి

సీతారామపురం: ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒకే రాతిలో మలిచిన అష్ట దేవాలయాల వద్ద ఆయన పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. త్రిముఖ దుర్గాబర్గులేశ్వరుడి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆయన్ను పూలమాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చప్పిడి తిరుపతిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనరు బాలినేని మాబయ్య, సర్పంచ్‌లు మునగాల రామచంద్రారెడ్డి, దుర్గాప్రసాద్, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, అలీఅహ్మద్, సోదా జనార్దన్‌రెడ్డి, పిడతల ఓబులేసు, గుర్రం సుబ్బయ్య, సతీష్, ప్రకాశం, జయపాల్ పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలన


ఐటీఐ కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దాత, వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: సంగంలో జీఆర్ఎన్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించనున్న ఐటీఐ కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని ఆదివారం భవన దాత గంటా రమణయ్యనాయుడు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఐటీఐ కళాశాల నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపు మేరకు సంగంకు చెందిన గంటా రమణయ్యనాయుడు ఐటీఐ కళాశాల నిర్మాణానికి ముందుకొచ్చారన్నారు. సంగంలో ఐటీఐ కళాశాలలో ఐదున్నర ఎకరాల స్థలంలో నిర్మాణమవుతుందని, ఇది అందరికి అందుబాటులోకి వస్తే నియోజకవర్గంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ లభిస్తుందని, తద్వారా మరింత మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. వీరి వెంట కళాశాల ప్రిన్సిపాల్ కె ఏడుకొండలు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పల్లె నిద్ర


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు

కావలి: దగదర్తిలోని మిక్స్‌డ్ కాలనీలో శనివారం రాత్రి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లెనిద్ర చేశారు. తొలుత కాలనీలో ఎంపీపీ వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రతి ఇంటిని సందర్శించారు. కాలనీ ప్రజల సమస్యలను, వారికి అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలో ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యులకు వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా జీవిస్తున్నారన్నారు. నాలుగున్నర ఏళ్లలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చి, అవినీతి రహిత పాలన అందడంతో ప్రజలు సంతృప్తి చెందే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండేళ్లు కరోనా సమయంలో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా పరిపాలన అందించారన్నారు. పేదరికం విద్య, వైద్యం, వ్యవసాయానికి, సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్వీ ప్రసాద్‌నాయుడు, ఆత్మకూరు గిరి నాయుడు, వంటేరు శ్రీనివాసులు, చల్లా శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు పాల్గొన్నారు.